వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 034
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
జనవరి 12, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# అనుమతులు నిల్లు.. దందా జోరు



- ప్రభుత్వ ఆదాయానికి గండి
- తక్కళ్లపహాడ్‌లో రియల్టర్ మోసం

**వరంగల్ వాయిస్, దామెర:** మండల కేంద్రంలోని తక్కళ్లపహాడ్ గ్రామ పరిధిలో అనుమతులు లేకుండానే అక్రమ లేఅవుట్లు జోరుగా వెలుస్తున్నట్లుగా, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నట్లు ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అధికారులు ఈ వ్యవహారాన్ని పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.( **వివరాలు 8లో..** )





# జాతర్లకు వేళాయె..



- మకర సంక్రాంతి నుంచి ప్రారంభం కానున్న ఐనవోలు, కొత్తకొండ, ఊరుగొండ జాతర
- ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్న ప్రభ బండ్లు
- ఆనవాయితీగా స్వామివారికి పట్నాలు
- 28 నుంచి తెలంగాణ కుంభమేళా మేడారం జాతర
- సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం తరలి రానున్న కోట్లాది భక్తులు

కొత్త ఏడాది జనవరి మాసంలోనే తెలంగాణ భక్తజనానికి జాతరలు ఆహ్వానం పలుకుతున్నాయి. మకర సంక్రాంతి పర్వదినం నుంచి కోరిక కోర్కెలు తీర్చే ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతర, కోరమీసాల కొత్తకొండ జాతర, ఊరుగొండ లక్ష్మీ నరసింహస్వామి జాతరలు ప్రారంభం కానున్నాయి. ఈ జాతరల్లో ప్రభ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. స్వామి వార్లకు పట్నాలు వేయడం ఆనవాయితీగా సాగుతోంది. వేలాదిగా తరలివచ్చే భక్తులకు స్వామి వారి దర్శనం నుంచి తిరుగు ప్రయాణం అయ్యే వరకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పాలక మండలి ఆధ్వర్యంలో కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు వేశారు. అదే విధంగా తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క-సారలమ్మ జాతర సైతం ఈ నెల 28న ప్రారంభమై నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మేడారం జాతరకు మాస్టర్ ప్లాన్ రూపొందించి అందుకు అనుగుణంగా కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేశారు. దీంతో జనవరి మాసం మొత్తం పండగ వాతావరణం నెలకొననుంది.

- వరంగల్ వాయిస్, కాశీబుగ్గ

వివరాలు 2లో..



8లో..

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

☐ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

## బలమైన పార్టీని నిర్మిస్తాం..

- బీజేపీ నేతలు కొప్పు భాష, గంట రవికుమార్
- ఘనంగా బూత్ నిర్మాణ్ అభియాన్ జిల్లా కార్యశాల




8లో..



8లో..

## కాంగ్రెస్ జెండా ఎగరాలి..


- కష్టపడే కార్యకర్తలకే ప్రాధాన్యం
- అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమమే కాంగ్రెస్ బలం
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నాయిని
  పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

# జాతర్లకు వేళాయె..









- సంక్రాంతి నుంచి ప్రారంభం కానున్న ఐనవోలు, కొత్తకొండ, ఊరుగొండ జాతర
- ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్న ప్రభ బండ్లు
- ఆనవాయితీగా స్వామివారికి పట్నాలు
- 28 నుంచి తెలంగాణ కుంభమేళా మేడారం జాతర
- సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం తరలి రానున్న కోట్లాది భక్తులు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ** : తెలంగాణ కుంభమేళాగా పేరుపొందిన గిరిజనుల జాతర సమ్మక్క– సారలమ్మ జాతర. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున సమ్మక్క– సారలమ్మ జాతర సాగుతుంది. ఈ సంవత్సరం జనవరి 28 నుంచి మేడారంలో జాతర ప్రారంభం కానుంది. ఇక్కడ దేవతలు కుంకుమభరిణే రూపంలో గద్దెల మీదకు వచ్చి మూడు రోజుల పాటు కొలువుదీరుతారు. వంశపారంపర్యంగా వస్తున్న ఆదివాసీ పూజారూలు మాత్రమే వనదేవతలను ప్రత్యేక పద్ధతుల్లో గద్దెలపైకి తీసుకువస్తారు. జనవరి 28వ తేదీ బుధవారం శ్రీ సారలమ్మ, 29వ తేదీ గురువారం సమ్మక్క గద్దెల మీదికి చేరుకుంటుంది. 30వ తేదీ శుక్రవారం భక్తులు పెద్దఎత్తున మొక్కులు చెల్లించుకుంటారు. 31వ తేదీ శనివారం సమ్మక్క, సారలమ్మ వనదేవతలతోపాటు గోవిందరాజు, పగిడిద్ద రాజులు వన ప్రవేశం చేయనున్నారు. తల్లులను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. శాశ్వత ప్రాతిపదికన రూ.251 కోట్లతో సమ్మక్క– సారలమ్మ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసినందున ఈ ఏడు భక్తులు రెండు కోట్లకు చేరుకుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. జాతర జరుగు నాలుగు రోజుల పాటు ఊరు, వాడ అంతా మేడారం నామ స్మరణతోనే మారుమోగనుంది. మేడారం వచ్చే భక్తులకు అధికారులు కావాల్సిన అన్ని వసతులు సమకూర్చుతున్నారు. ఆర్టీసీ అధికారులు వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను భక్తులకోసం సిద్ధంగా ఉంచారు. జంపన్న వాగులో స్నానం చేసిన భక్తులు అమ్మవార్లను దర్శించుకొని తరించనున్నారు. ఇక్కడ అమ్మవార్లకు బెల్లాన్ని ప్రసాదంగా సమర్పిస్తారు. బెల్లాన్ని బంగారంగా పిలుస్తారు. కోరిన కోరికలు తీరితే అమ్మవార్లకు నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించడం ఆచారంగా వస్తోంది.



### ఐనవోలు జాతర..

హనుమకొండ జిల్లాలో ఉన్న మరో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఐనవోలు. ఇక్కడ కొలువై ఉన్న శ్రీ మల్లికార్జునుడు భక్తుల కోరిన కోర్కెలు తర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్నారు. కాకతీయుల కాలంలో స్వామివారి గుడిని నిర్మించారు. కాకతీయులు నిర్మించిన గుడి నిర్మాణాలు అబ్బురపరుస్తాయి. పరమశివుడు ఇక్కడ మనకు వ్యక్తిరూపంలో దర్శనమిస్తారు. గ్రామీణ ప్రజలు స్వామి వారిని మల్లన్న దేవుడిగా పిలుస్తారు. తెలంగాణలో ఉన్న ఏడుగురు మల్లన్నల కథలో ఐనవోలు మల్లన్న పెద్దవాడు. కాకతీయుల కాలంలో స్వామి వారు మైలార దేవుడిగా పూజలందుకున్నాడు.

స్వామి వారి జాతర కూడా పుష్యమాసంలోనే జరగడం ఆనవాయితీగా ఉంది. ఇక్కడకు కొన్ని ప్రత్యేక పర్వదినాలలో నాగసాధువులు వచ్చి స్వామివారిని దర్శనం చేసుకుంటారని స్థానికులు చెబుతున్నారు. ఈ నెల 13న మంగళవారం ధ్వజారోహణంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. 14న భోగి, 15న మకర సంక్రాంతి సందర్భంగా బండ్లు తిరుగుట, 16న కనుమ, 17న మహాసంప్రోక్షణ సమారాదన; 23న భ్రమరాంభిక వసంతపంచమి, భ్రమరాంభిక అమ్మవారి త్రయోదశ వార్షికోత్సవం, ఫిబ్రవరి 1 ఆదివారం ఎల్లమ్మ దేవత పండుగ కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించనున్నారు. ధ్వజారోహణ రోజు స్వామి వారికి నూతన వస్త్రాలంకరణ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, ధ్వజారోహణము, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము మహానివేదన నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాదలతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయు భక్తులు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వ, దేవాలయ నిధులు, దాతల సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### ఊరుగొండ జాతర..


హనుమకొండ జిల్లాలో ఉన్న మరో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఊరుగొండ లక్ష్మీ నరసింహ స్వామి. ఈ స్వామి వారి జాతర కూడా మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రారంభం అవుతుంది. జాతర అధికారికంగా ముందే ప్రారంభమైనప్పటికీ ప్రధాన ఘట్టం మాత్రం సంక్రాంతి పర్వదినం నాడు బండ్లు తిరుగుట, స్వామివారు గుట్టమీదకు వెళ్లడంతో పీక్ స్టేజ్ కు వెళ్తుంది. ప్రజలు వేలాది తరలి వచ్చి నరసింహుడికి మొక్కులు సమర్పించుకుంటారు. ప్రభ బండ్లు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.





### కొత్తకొండ జాతర..

ఉత్తర తెలంగాణలో సమ్మక్క–సారలమ్మ తరువాత రెండో అతిపెద్ద జాతరగా కొత్తకొండ జాతరకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ ప్రధాన దైవం శ్రీ వీరభద్ర స్వామి. ప్రతి సంవత్సరం మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా జాతర ప్రారంభం అవుతుంది. స్వామి వారి కల్యాణోత్సవంతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు అగ్నిగుండాలతో ముగుస్తుంది. ఆలయంలో ఈ నెల 13న లక్ష బిల్వార్చన, 14న భోగి, 15న మకర సంక్రాంతి సందర్భంగా జాతర, 16న కనుము, 17న త్రిశూలస్నానం, 18న అగ్నిగుండాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దాదాపు నెల రోజుల పాటు సాగే ఈ జాతరకు కనీసం ఐదు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. స్వామి వారికి కోరమీసాలు, గుమ్మడికాయలు సమర్పిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. సంక్రాంతి, కనుమ పండగనాడు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఏ గుడికి లేని విధంగా ఈ గుడికి మూడు ప్రధాన ధ్వజ స్తంభాలు ఉంటాయి. స్థానికంగా వీరభద్ర స్వామిని కొత్తకొండ ఈరన్నగా పిలుస్తారు. స్వామివారి కాలు ఒక పక్కకు వంగి ఉండటం ఇక్కడ మనకు కనిపిస్తుంది. జాతరకు ఆర్టీసీ హుజూరాబాద్, హనుమకొండ నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నారు.



# యువతకు వివేకానందుని బోధనలే ఆదర్శం

◆ కొడిమాల శ్రీనివాసరావు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వామి వివేకానంద 164వ జన్మదిన వేడుకలను, జాతీయ యువజన దినోత్సవంను పురస్కరించుకుని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల నుంచి పాపాయిపేట్ చమన్ లోని వివేకానంద విగ్రహం వరకు విద్యార్థి వాలంటీర్లతో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వాలంటీర్లను ఉద్దేశించి కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ... 1893 సెప్టెంబర్ 11న చికాగోలో జరిగిన "ప్రపంచ మత సదస్సులో" స్వామి వివేకానంద గారు 'నా ప్రియమైన అన్నలారా, అక్కల్లారా' అని సంబోధిస్తూ చేసిన ప్రసంగం సభికులను ఎంతగానో ఉత్తేజపరిచింది. హిందూమత గొప్పతనాన్ని, విశ్వమానవులంతా ఒకే కుటుంబమని, అదే వసుదైక కుటుంబం అనే భావాన్ని ఆయన ప్రపంచానికి చాటారు. వివేకానందుని ప్రసంగాలు, బోధనల ద్వారా యువతలో ఆత్మస్థైర్యం పెంపొంది, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడ్డాయి. యువత దృఢ సంకల్పంతో లక్ష్యం వైపు దూసుకువెళ్లి విజయం సాధించాలని, తద్వారా దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ అధ్యాపకులు నాగ శ్రీనివాస్, భాస్కర్, పరేష్ కుమార్, సీనియర్ వాలంటీర్లు సాకేత్, పూర్ణ చారి, సాయి, హర్షిత్, రోహిత్, శ్రీధర్, దుర్గ, నీరజ్, రుత్విక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

• తహసీల్దార్ ఇమామ్ బాబా



**వరంగల్ వాయిస్, చిట్యాల:** మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల తహసీల్దార్ ఇమామ్ బాబా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద సూక్తులు ఈరోజు ప్రపంచ నలుమూలల వ్యాపించి, ఆయన్ని అందరూ ఆదర్శంగా తీసుకుంటున్నారని తెలిపారు. ఈరోజును భారతదేశ వ్యాప్తంగా యువజన ఉత్సవంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. "బలమే జీవనం, బలహీనతే మరణం" లాంటి సూక్తులతో ఆయన యువకుల్లో మనోధైర్యాన్ని నింపారని కొనియాడారు. వివేకానందుడు ప్రపంచ నలుమూలలకు మన సంస్కృతి, సంప్రదాయాన్ని తెలియజేశారని, ఆయన జీవితం దేశం కోసం పనిచేసిందని అన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని, ఆయన చూపిన మార్గంలో నడవాలని తాసిల్దార్ ఇమామ్ బాబా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తౌటం లక్ష్మి, స్థానిక ఎస్సై శ్రావణ్ కుమార్, ఉప సర్పంచ్, బీజేపీ చిట్యాల మండలాధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డ్ మెంబర్ తౌటం నవీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అలా రవీందర్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, వార్డు సభ్యులు జెట్టి కుమార్, చందు, శనిగరం మొగిలి, గుండ కుమార్, వల్లన ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత



**వరంగల్ వాయిస్, చిట్యాల:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య ఆధ్వర్యంలో గ్రామంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి స్థానిక తహసీల్దార్ ఇమామ్ బాబా, ఎంపీడీఓ జయశ్రీ, స్థానిక ఎస్సై శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేశారు.ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతి పోతుగంటి సునీతకు రూ.5,116, మాసు వనితకు రెండవ బహుమతి రూ.3,116, మూడవ బహుమతి వాళ్ళలా నిరోషాకు రూ. 1,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో విజేతలకు గ్రామ ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్, వార్డు సభ్యులు తౌటం నవీన్, జెట్టి కుమార్, స్థానిక ఎస్సై శ్రావణ్ బహుమతులు అందజేశారు.

## కేయూలో వివేకానందుడి జయంతి




**వరంగల్ వాయిస్, కేయూ :** స్వామి వివేకానంద యువతకు నిరంతర స్ఫూర్తి ప్రదాత అని కేయూ ఉపకులపతి ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద 164వ జయంతిని పురస్కరించుకుని, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవన ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, పుల్లూరి సుధాకర్ తో పాటు డీన్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వివేకానంద మాటలు ఆచరణీయం

◆ చేబెల్లి మహేందర్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని అన్నారం గ్రామంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివేకానంద స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు చేబెల్లి మహేందర్ మాట్లాడుతూ... అంటరానితనం, కుల ఆధారిత అసమానతలను పూర్తిగా తొలగించడం ద్వారానే సనాతన ధర్మాన్ని, భారతదేశ సంస్కృతిని ప్రపంచానికి చాటాలన్న స్వామి వివేకానంద ఆశయాలను నేటి సమాజం తప్పక ఆచరించాలని పిలుపునిచ్చారు. స్థానిక సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ మాట్లాడుతూ... నేటి యువత వివేకానందుని ఆశయాలను ఆదర్శంగా తీసుకొని, దేశ పురోగతి కోసం ముందుకు సాగాలని అన్నారు. జయంతిని పురస్కరించుకుని ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు స్థానిక గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను గౌరవంగా సన్మానించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు బత్తిని జలందర్, సేవా సమితి ఉపాధ్యక్షులు గొల్లపెల్లి సంతోష్, గ్రామ కార్యదర్శి మోహిన్, బుర్ర సంతోష్, కనుకుంట్ల రాజమహేందర్, ఆర్. దామోదరా చారి, నాగేల్లి దర్గయ్య, జి.ప్రేమిచంద్, రత్నాకర్, రతన్, సాయిరాం, వార్డు సభ్యులు రవి, నాగరాజు, పవన్ కళ్యాణ్, రాజబాబు, స్థానిక పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** యువతకు ఆదర్శప్రాయులు, భారతీయ ఆధ్యాత్మిక చింతనను ప్రపంచానికి చాటిన మహనీయులు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సోమిడిలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. సోమిడిలోని 62వ డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రావణ్ యాదవ్ మాట్లాడుతూ, స్వామి వివేకానంద గారి ఆదర్శప్రాయమైన జీవితాన్ని, శక్తివంతమైన ప్రసంగాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. యువత తమ శక్తిసామర్థ్యాలను దేశ పురోగతికి, సమాజ సంక్షేమానికి వినియోగించాలని, తద్వారా వివేకానందుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కాయిత రాజ్ కుమార్ యాదవ్, బండి భిక్షపతి, గొర్రె శంకర్, రాజు, నిరంజన్, చందు, విజయ్, వరుణ్, హేమలత, ప్రణవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాట్రపల్లిలో..



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** మండలంలోని కాట్రపల్లి గ్రామంలో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 163వ వివేకానంద జయంతి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... వివేకానంద జీవితం యావత్ యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను యువతరం ఆచరించి, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ముద్రబోయిన శ్రీనివాస్, ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మాచారి, ఉప సర్పంచ్ గుండ్లపల్లి మధు, యూత్ అధ్యక్షులు చెనబోయిన కుమార్, సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## వివేకానంద బోధనలు యువతకు మార్గదర్శకం



**వరంగల్ వాయిస్, శాయంపేట:** నేటి యువతకు స్వామి వివేకానంద బోధనలు మార్గదర్శకంగా నిలుస్తాయని శాయంపేట ఎస్సై పరమేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పరమేశ్వర్... అధ్యక్షుడు గిద్దమార్ సురేష్, అడ్వకేట్ లెక్కల జలంధర్ రెడ్డి, సర్పంచ్ చింతల ఉమా రైపాల్ లతో కలిసి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాల బాటలో యువకులు ముందుకు సాగాలని కోరారు. జయంతి వేడుకల సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళ ఉద్యోగిపై దాడి

● నిందితుడిని కఠినంగా శిక్షించాలి




**వరంగల్ వాయిస్, గణపురం:** నర్సంపేట మత్స్యశాఖ కార్యాలయంలో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళా ఉద్యోగి పరికి జ్యోత్స్నపై దాడి చేసిన నిందితుడిని వెంటనే కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గణపురం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. మాదన్నపేట గ్రామానికి చెందిన దళిత మహిళా ఉద్యోగి జ్యోత్స్న తన విధులకు ఆటంకం కలిగిస్తుండగా, కారణం అడిగినందుకు జనవరి 2, 2026 న ఆఫీసులో ఆమె రూమ్‌లోకి వెళ్లి దాడి చేసినట్లు నాయకులు తెలిపారు. తోటి ఉద్యోగి అయిన అగ్ర బ్రాహ్మణ కులానికి చెందిన డేటా ఆపరేటర్ గుడారపు చైతన్య శర్మ, దళిత మహిళ తనతో సమానంగా ఉద్యోగం చేస్తుందన్న అహంకారంతోనే ఈ దాడికి పాల్పడ్డాడని సంఘం నాయకులు ఆరోపించారు. చైతన్య శర్మపై చట్టపరమైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడి జరిగినప్పటికీ ఇప్పటివరకు నిందితుడిపై ఎలాంటి చర్య తీసుకోకపోవడం దళిత మహిళకు అన్యాయం చేయడమేనని వారు అన్నారు. ఇప్పటికైనా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకపోతే, దళిత సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శనిగరపు రాజేందర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు, 2వ వార్డ్ మెంబర్ తిక్క సంపత్, మండల నాయకులు చిలువేరు సుధాకర్, దూడపాక పున్నం, వి.రాజేంద్రప్రసాద్, పి.నరేష్, ఎన్నిండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కోటగుళ్లలో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద, కాకతీయుల కళాక్షేత్రం అయిన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు)లో తొర్రూర్ ఆర్డీవో కార్యాలయ ఏఓ, తహసీల్దార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తహసీల్దార్ కుమ్మరి కుంట్ల అనిల్ కుమార్, వారి సతీమణి శైలజ ఆదివారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం, అర్చకులు నాగరాజు, కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా, తహసీల్దార్ దంపతులు కోటగుళ్లు గోశాలలోని గోమాతలకు దాన బస్తాలను (పశువుల మేత) అందజేశారు.

## వరంగల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా ఏకాంతం గౌడ్




**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టాపురం ఏకాంతం గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏకాంతం గౌడ్ మాట్లాడుతూ... జిల్లాలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ పదవి లభించడానికి సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా, తన రాజకీయ గురువులు, శ్రేయోభిలాషులైన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్, మల్లాడి తిరుపతి రెడ్డిలకు, అలాగే బీజేపీ జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు ఏకాంతం గౌడ్ ధన్యవాదాలు తెలియజేశారు.


## కొత్త రేషన్ షాపు ప్రారంభం



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల పరిధిలోని అప్పయ్యపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ కూడా పాల్గొన్నారు. రేషన్ షాపును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్న బియ్యం పథకాన్ని పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు పిల్లి రాజయ్య, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే గ్రామానికి చెందిన ఎలబోయిన ఎర్ర మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఎనిమిదో రోజు సందర్భంగా ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, క్యాన్సర్ వ్యాధితో మరణించిన అంబటి లక్ష్మి మూడో రోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్, ఉపసర్పంచ్ కనపర్తి వినయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కన్నబోయిన కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొడారి రవీందర్, సీనియర్ నాయకులు మార్నేని ఉపేందర్ రావు, దోమల రాజయ్య, కొడాలి రవీందర్, ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పని చేయని మొబైల్ నెట్‌వర్క్‌లు

**తీవ్ర ఇబ్బందుల్లో గ్రామస్తులు**



**వరంగల్ వాయిస్, ఖిలాషాపురం:** ఖిలాషాపురం గ్రామంలో మొబైల్ నెట్‌వర్క్‌లు సరిగా పని చేయకపోవడంతో స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య కారణంగా దైనందిన కార్యకలాపాలు, అత్యవసర సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్స్, ఇంటర్నెట్ లేమి: మొబైల్ కాల్స్ వెళ్లకపోవడం, ఇంటర్నెట్ సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడం వల్ల సాధారణ సమాచార మార్పిడికి అంతరాయం కలుగుతోంది. ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోవడం వల్ల విద్యార్థుల ఆన్‌లైన్ విద్యకు, తరగతులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రైతులు వ్యవసాయానికి సంబంధించిన ముఖ్య సమాచారం, వాతావరణ వివరాలు ఆన్‌లైన్‌లో పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో (ఉదాహరణకు, వైద్య సేవలు, అంబులెన్స్) తక్షణ సహాయం కోసం ఫోన్ చేయలేని దయనీయ పరిస్థితి నెలకొంది. బ్యాంకింగ్, ప్రభుత్వ సేవలు, ఇతర ముఖ్యమైన ఆన్‌లైన్ లావాదేవీలు నిలిచిపోవడంతో ప్రజలు నష్టపోతున్నారు.

## ఘనంగా ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల:** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను పరకాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తొమ్మిదవ వార్డు ఇంచార్జ్ దార్న వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, తొమ్మిదవ వార్డు మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్, సంగం మండల ఎక్స్ ఎంపీపీ కందకట్ల నరహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు కేక్ కట్ చేసి ప్రియాంక గాంధీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రియాంక గాంధీ ఇందిరా గాంధీ వారసురాలుగా రాజకీయ ప్రవేశం చేసి, అనతికాలంలోనే అగ్ర నాయకురాలుగా ఎదిగారని కొనియాడారు. పార్టీ బలోపేతానికి ఆమె కృషి ఎంతో గొప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదవ వార్డ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎల్లండి సురేష్, బండారి కృష్ణ, వంగర సుమలత, రావుల సాంబయ్య, రావుల తిరుపతి, తంగేళ్ల నవీన్ రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో లక్ష్మీదేవర బోనాల జాతర

◆ భక్తులకు టీషర్ట్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవపూర్ మండలం, కాళేశ్వరంలో నాయకపోడ్ ఆరాధ్యదైవమైన శ్రీ లక్ష్మీదేవర బోనాల జాతరను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల పవన్ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు, గ్రామ యువతకు టీషర్ట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 30 టీషర్ట్స్‌ను ఆయన పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఘనంగా నిర్వహించే ఈ లక్ష్మీదేవర బోనాల జాతర... కాళేశ్వరం గ్రామ ప్రజల ఆచార సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్ శర్మ మాట్లాడుతూ... "లక్ష్మీదేవర బోనాల జాతర కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, ఇది గ్రామ ఐక్యతకు, సంస్కృతి పరిరక్షణకు నిదర్శనం. ఇలాంటి పవిత్ర కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి సహకరించాలి. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి. దేవాలయ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. భక్తుల సందడి, భక్తి శ్రద్ధలతో కాళేశ్వరం గ్రామం ఉత్సవ వాతావరణంతో కళకళలాడింది. గ్రామ ప్రజలందరూ శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జాతర కార్యక్రమాల్లో పాల్గొని శ్రీ లక్ష్మీదేవర స్వామి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, జనవరి 12, 2026

# ముగ్గులు మన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక

◆ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి:** ముగ్గులు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని, ప్రతి మహిళ తన ఇంటి ముంగిట వేసే ముగ్గులో కళాత్మకత స్పష్టంగా కనిపిస్తుందని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. సంక్రాంతి పండుగ విశిష్టతను, గ్రామీణ కళల గొప్పతనాన్ని చాటే ముఖ్యమైన సంప్రదాయం ముగ్గులని ఆయన పేర్కొన్నారు. చక్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, ఇవి మన సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. చక్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు చిట్టిపల్లి దేవిక మాట్లాడుతూ... మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. మహిళలకు ఇలాంటి వేదికలు కల్పిస్తే వారు తమ ప్రతిభను మరింతగా చూపగలరని ఆమె అన్నారు. ప్రముఖ సామాజికవేత్త, ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ... ఫౌండేషన్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు, సామాజిక హిత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత వంటి రంగాల్లో నిరంతరం సేవలు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు ఎంతో ఉత్సాహంగా, ఆకర్షణీయంగా రంగురంగుల ముగ్గులు వేసి అందరి మనసులు గెలుచుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి ఘనంగా ప్రదానోత్సవం నిర్వహించారు. చిన్నారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిమ్మల శ్రీనివాస్ ప్రత్యేకంగా అట్లాస్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లెల స్వప్న, పద్మజారాణి, నాగలక్ష్మి, సుశీల, శ్రీధర్ స్వామి, డాక్టర్ వీరస్వామి, జె.బీ. ఆర్ట్స్ అధ్యక్షులు జడల శివ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఫౌండేషన్ కోశాధికారి కట్కూరి రమేష్ వందన సమర్పణ చేయగా, ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# అధికారులను కలిసిన ప్రజాప్రతినిధులు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** మండల పరిధిలోని ఖిలాషాపురం గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ శాగ కవిత అశోక్, ఉప సర్పంచ్ బక్క సరిత మల్లేష్ అధికారికంగా పలువురు ప్రభుత్వ అధికారులను, ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్ దంపతులు రఘునాథపల్లి మండల ప్రభుత్వ అధికారులు తహసీల్దార్, ఎంపీడీఓలను, రఘునాథపల్లి గ్రామ నూతన సర్పంచ్ ఎన్నికైనా బొల్లం ఉమారాణి రాజీవ్ లను ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖిలాషాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు కావటి యాదగిరి, కో-ఆర్డినేటర్ ముప్పిడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, మాజీ పాక్స్ డైరెక్టర్ జిట్టే వీరస్వామి, మైనారిటీ మండల అధ్యక్షులు మొహమ్మద్ గౌస్, ఖిలాషాపురం యూత్ అధ్యక్షులు మేడే అశోక్, 11వ వార్డ్ మెంబర్ సంగి రాజు, 9వ వార్డ్ మెంబర్ బుడిగే సునీత, శాగ అరుణ్, ఎండీ షేబిర్ తదితరులు పాల్గొన్నారు.

# పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం



**వరంగల్ వాయిస్, శాయంపేట:** జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శాయంపేట మండలం, మైలారం గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నూనె దివ్య తిరుపతి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో పాల్గొన్న మండల పశు వైద్య అధికారి డాక్టర్ సునీల్ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు తప్పకుండా గోపాలమిత్రుల సేవలను వినియోగించుకోవాలి. పశువులు ఎదకు వచ్చినప్పుడు సకాలంలో కృత్రిమ గర్భధారణ చేయించాలి. పశువుల పోషణ కోసం అవసరమైన పశుగ్రాసాలను సాగు చేసుకోవాలి. దూడలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులను త్రాగించాలి. పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిబిరంలో మొత్తం 48 పాడి పశువులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించి, వాటికి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ ప్రకాష్ రెడ్డి, గోపాలమిత్రులు సుదర్శన్, రంజిత్, సతీష్, ప్రజ్వల్ ప్రతినిధులు అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**వరంగల్ వాయిస్, రాయపర్తి:** మండలంలోని ఊకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల కింద సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఈ దవాఖాన మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పల్లె దవాఖానల ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు తమ గ్రామంలోనే అందుబాటులోకి వస్తాయని అన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే చికిత్స పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతూ, రాయపర్తి మండల అభివృద్ధికి అవసరమైన అన్ని రంగాల్లో తాము కట్టుబడి పనిచేస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక సర్పంచులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# లాల్ బహదూర్ శాస్త్రికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, రామన్నపేట:** వరంగల్ రామన్నపేటలో భారత మాజీ ప్రధానమంత్రి, మహనీయులు లాల్ బహదూర్ శాస్త్రి గారి వర్ధంతి వేడుకలను డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ కార్యాలయంలో శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్టీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రపంచంలో దేశ కీర్తిని పెంచిన మహనీయుడికి నివాళులర్పించడం ప్రతి భారత పౌరుడి బాధ్యత అన్నారు. దేశ రెండో ప్రధానమంత్రిగా, 'జై జవాన్ జై కిసాన్' అనే నినాదాన్ని ఇచ్చి యావత్ ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన శాస్త్రి సేవలు మరువలేనివి అని కొనియాడారు. "ఇటువంటి మహనీయులను ప్రభుత్వం మర్చిపోవడం చాలా బాధాకరం. ఇకముందు కనీసం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా నిర్వహించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. నేడు ధన్యవాదాల దినోత్సవం (థాంక్స్ గివింగ్ డే) సందర్భంగా, మనకు సహాయం చేసిన వారికి కృతజ్ఞతగా ధన్యవాదాలు చెప్పాల్సిన అవసరం ఉందని రాజేంద్రప్రసాద్ గుర్తుచేశారు.అలాగే, మానవ అక్రమ రవాణా అవగాహన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇది అత్యంత దురదృష్టకరమైన, చెడ్డ సమస్య అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే దీనిపై ఒక చట్టాన్ని రూపొందించి, పోలీస్ శాఖ కఠినమైన చర్యలు తీసుకునేట్లుగా చర్యలు చేపట్టాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు–ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరం, 36వ డివిజన్ చింతల్ పరిధిలో ఆడేపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు – ముగ్గుల పోటీలు అత్యంత ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ సీఐ కొడూరి సుజాత మాట్లాడుతూ మహిళలు సంప్రదాయ పండుగలను ఉత్సాహంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. అదే విధంగా, ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఫిట్‌నెస్ ట్రైనర్ శ్రావంతి పండుగలతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళలు రోజువారీ వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, స్థానిక సంప్రదాయాలు, మహిళల సృజనాత్మకతను వెలుగులోకి తీసుకొచ్చే ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలకు మీడియా పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఆడేపు ఫౌండేషన్ చైర్మన్ ఆడెపు వెంకటేష్ మాట్లాడుతూ... సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగల ద్వారా మన సంస్కృతి, ఐక్యతను భవిష్యత్ తరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. మహిళల ప్రతిభను ప్రోత్సహించడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ముగ్గుల పోటీలను జడ్జీల బృందం నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేసింది. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేశారు. పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించి, కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ చిదురాల రాజు, అంబటి మీనా, గుండేడి రాజు, సిద్ధరాజు, అనుమాండ్ల స్వాతి, సృజన, స్వాతి, లోకేష్, సిద్ధార్థ్, కొలేపాక శ్రావంతి, మాధేవి, రవళి, లలిత, ధనలక్ష్మి, సాయి, రిథ్విక్, హరిత, భాను తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బన్న ప్రభాకర్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బన్న ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఒక ప్రకటనలో ఈ నియామకాన్ని ప్రకటించారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బన్న ప్రభాకర్ మాట్లాడుతూ... జిల్లాలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కీలక బాధ్యత అప్పగించినందుకు ఆయన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి, మండల నాయకులకు, పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, పరకాల:** 'వరంగల్ వాయిస్' దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను పరకాల సీఐ క్రాంతి కుమార్, ఉషా తేజ కూల్ డ్రింక్స్ అధినేత తమ్మిశెట్టి వెంకన్న (థమ్సప్ వెంకన్న)లు సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవ మూర్తికి, అలాగే పరకాల, దామెర రిపోర్టర్లు బొజ్జం చొక్కారావు, ఉస్నగిరి శ్రీకాంత్ లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నారగొని రమేష్, సురేందర్, శ్రీనివాస్, కార్తీక్ పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణకు జాతీయ ఉమ్మడి వేదిక ఏర్పాటు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వీబీ–జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (నరేగా) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించడానికి జాతీయ స్థాయిలో ఉమ్మడి వేదిక ఏర్పడింది. ఈ విషయాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో వ్యవసాయ కార్మికుల, గ్రామీణ పేదల సంఘాల, నరేగా సంఘర్ష్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జాతీయ కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రముఖ మేధావులు పాల్గొన్నారు. సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం...వీబీ–జీ రామ్ జీ చట్టం రద్దు, నరేగా పునరుద్ధరణ కోసం దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మొదటి దశలో నెల రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. ఉమ్మడి వేదిక ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా సమావేశాలు, కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలి. ఫిబ్రవరి 2నరేగా 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల ముందు ప్రతిఘటన దినంగా పాటించి ప్రదర్శనలు నిర్వహించాలి. ఫిబ్రవరి 12న జాతీయ కార్మిక సంఘాల సమ్మెలో చురుకుగా పాల్గొనాలి. నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని, నరేగా పునరుద్ధరణ చేసి, సంవత్సరంలో 200 రోజుల పనులు, రోజుకు రూ. 700 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ గ్రామాన ఉపాధి కూలీలకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని కూడా పిలుపునిచ్చారు.

## వరంగల్ జిల్లా బీజేపీ సోషల్ మీడియా ఇంచార్జిగా నోముల రతన్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా ఇంచార్జిగా నోముల రతన్‌ను మరోసారి నియమించారు. జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ నేతృత్వంలో పార్టీ జిల్లా నాయకత్వం ఆయనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా నోముల రతన్ మాట్లాడుతూ... తనపై మరోసారి నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు శ్రీ గంటా రవికుమార్ గారికి, అలాగే వరంగల్ జిల్లా బీజేపీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పెద్దలు నాపై ఉంచిన విశ్వాసం నాకు మరింత బాధ్యతను కల్పించింది. వారి అనుభవాలను ఆదర్శంగా తీసుకొని, సోషల్ మీడియా వేదికగా భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు నిబద్ధతతో పనిచేస్తాను. పార్టీ కార్యక్రమాల్లో ముందుండి ప్రజాసేవలో పాల్గొంటానన్నారు. యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ, సోషల్ మీడియా ద్వారా బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా తన వంతు పాత్రను పూర్తి స్థాయిలో నిర్వహిస్తానని నోముల రతన్ స్పష్టం చేశారు.

# కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

- కాంగ్రెస్ నేత సోదా రామకృష్ణ
- మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం



**వరంగల్ వాయిస్, పరకాల:** స్థానిక మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో రాబోయే మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది. వార్డు అధ్యక్షుడు బొచ్చు సాల్మన్ గారి అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటు చేయగా, వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, వార్డు ఇంచార్జ్ గోపతి రవి యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ, ఎన్నికల సమయంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే దానిపై వ్యూహాలు చర్చించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, వార్డు ఇంచార్జి గోపతి రవి యాదవ్ లు మాట్లాడుతూ... ఓట్ల ఇంచార్జిలను నియమించాలని సూచించారు. ఎవరికి కాంగ్రెస్ పార్టీ 'బీ–ఫాం' ఇచ్చినప్పటికీ, అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్క వసంత, రేండ్ల సంపత్, బొచ్చు శ్రీనివాస్, ఆశాల నర్సిరెడ్డి, రవ్వ సదానందం, ఇల్లందుల అశోక్, వెన్నంపెల్లి నాగరాజ్, లక్కం శంకర్, పెగడ రాజు, సిహెచ్ సమ్మయ్య, సాదు జయ్, అమరగంటి సమ్మయ్య, రాజన్న, సుచిత్ర, ప్రమోద్ కుమార్, సోమేశ్వర్, పద్మ, వీరస్వామి, సాంబయ్య, అజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా సర్పంచులకు సన్మానం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** తెలంగాణ టూరిజం కార్పొరేషన్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, రఘునాథపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వారాల రమేష్ యాదవ్ కలిసి నేడు జనగామ జిల్లాకు చెందిన వివిధ గ్రామాల సర్పంచులను ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచులు పోషిస్తున్న పాత్రను గుర్తించి ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సింగరి ప్రశాంత్ యాదవ్, యశ్వంతపూర్ గ్రామ సర్పంచ్ బొల్లా సంపత్ యాదవ్, గోవర్ధనగిరి గ్రామ సర్పంచ్ తోటకూరి సదానందం యాదవ్, రామారాయిని బంగ్లా గ్రామ సర్పంచ్ కోమలత కనకయ్య యాదవ్, వెల్ది గ్రామ ఉపసర్పంచ్ ఎడ్ల బాలరాజు, ముసిపట్ల అరుణ్, గాజుల రాజేందర్ పాల్గొన్నారు.

## ఉద్యోగ సహకార పరపతి సంఘం ఎన్నిక



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఉద్యోగ సహకార పరపతి సంఘం ఎన్నికలు ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్ లో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష,కార్యదర్శులు తాళ్ల చంద్రయ్య, కందగట్ల కుమారస్వామి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా నూతన అధ్యక్షుడిగా గుర్రం ఆనందం, ప్రధాన కార్యదర్శిగా ఎం.మురళీధర్, ఉపాధ్యక్షులుగా రేవూరి రఘుపతి రెడ్డి, ట్రెజరర్ గా జిన్న భూపాల్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా సహకార సంఘంలో సభ్యులుగా చేరిన అల్వాల రాజశేఖర్ రిటైర్డ్ ఆర్టీసీ డీఎం, ఆర్ రవీందర్ రెడ్డి (ఉపాధ్యాయులు), ఏరుకొండ రమేష్, రికార్డ్ అసిస్టెంట్లను శాలువా పూల బోకులతో కమిటీ ఘనంగా సన్మానించారు.

## అచ్చ సుదర్శన్‌కు పురస్కారం

**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అచ్చ సుదర్శన్‌కు ప్రతిష్టాత్మక 'స్వామి వివేకానంద జాతీయ పురస్కారం 2026' లభించింది. భారత్ మాత అభినందన సంఘటన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ పురుషోత్తం దాస్ మిట్టల్, కర్ణాటక అధ్యక్షుడు డాక్టర్ మలకప్ప అలియాస్ మహేష్ ఆన్‌లైన్ ద్వారా ఈ అవార్డును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత్వానికి, మానవాళికి నిస్వార్థ సేవ చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని, ఇది తనపై మరింత బాధ్యతను పెంచిందని అచ్చ సుదర్శన్ ఈ సందర్భంగా తెలిపారు.

# పరకాలలో బీజేపీ విజయకేతనం ఎగరవేయాలి

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్




**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సంపూర్ణ విజయం సాధించేలా కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎంపీ, హనుమకొండ జిల్లా ఇంచార్జి డా.బూర నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోని 22 వార్డులకు గాను 22 వార్డులు గెలవాలన్నదే బీజేపీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పరకాల పట్టణంలోని మహాదేవ కన్వెన్షన్ హాల్‌లో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరకాల ప్రాంతం ఎప్పటి నుంచో బీజేపీకి కంచుకోటగా ఉందని గుర్తు చేస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో సంపూర్ణ విజయం సాధించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. జిల్లా నాయకత్వం నిత్యం పరకాలలోనే ఉండి ఎన్నికలను పర్యవేక్షిస్తుందని తెలిపారు. మున్సిపాలిటీ గెలుపు కోసం ప్రతి వార్డుకు నియమించిన ఇంచార్జులు నిరంతరం అక్కడే ఉండి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, ప్రజల్లో బీజేపీ విధానాలను విస్తృతంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీ, ఉపాధి హామీ చట్టంపై స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి పబ్లిసిటీ ఎక్కువ, పని తక్కువ అని విమర్శించారు. గాంధీ పేరును కళంకితం చేసింది డూప్లికేట్ గాంధీలేనని ఎద్దేవా చేశారు. జీ–రాంజీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచినట్టు తెలిపారు. ఆదివాసులకు ఏకంగా 150 రోజుల పని కల్పించడం సంతోషకరమన్నారు. గతంలో ఉపాధి హామీ నిధులు ఆరు నెలలకు చెల్లించేవారని, బీజేపీ ప్రభుత్వం కేవలం 15 రోజుల్లోనే చెల్లిస్తున్నదని చెప్పారు. జీ–రాంజీ నిధులను కాలువలు, గోదాములు, ఫాం పాండ్లు, ఫిషింగ్, చేనేత, హార్టికల్చర్ వంటి పనులకు వినియోగించి గ్రామీణ రైతులకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. 15వ ఫైనాన్స్ నిధులను నేరుగా గ్రామ అభివృద్ధికి కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, బీజేపీ పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ విజయ చందర్ రెడ్డి, డా.సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్, గుజ్జ సత్యనారాయణ రావు, చందుపట్ల రాజేందర్ రెడ్డి, ఆర్పి జయంత్ లాల్, కొలంనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణాచారి, సంఘ పురుషోత్తం, ఎర్ర రామన్న, బాసాని సోమరాజు, మార్త భిక్షపతి, మేకల రాజవీరు, కుక్కల విజయ్ కుమార్, దంచనాల కిరణ్, పైండ్ల రంజిత్, గాజుల రంజిత్, వెలిశెట్టి శారద, పావుశెట్టి సునీత, బూత్ అధ్యక్షులు ఆకుల శ్రీధర్, సాదు మధుకర్, ఉపేందర్ రెడ్డి, మరాఠి నర్సింగ్, సారంగ నరేష్, సంగా నరేష్, తడక విక్రం, బీరం రాజిరెడ్డి, ఉడుత చిరంజీవి, నరేందర్, దాసరి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెల్దండి హేమంత్, ఏకు కృష్ణ, చిద్రికా అశోక్, తడక పూర్ణచందర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# సంక్రాంతికి అమెజాన్‌లో దండోరా రిలీజ్

తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. అయితే థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం జనవరి 14 నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించగా.. మురళీకాంత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తెలంగాణలోని తుళ్లూరు అనే గ్రామం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరిలో కుల వివక్ష వేళ్లూనుకుపోయి ఉంటుంది. ఎంతలా అంటే, తక్కువ కులానికి చెందిన వారు మరణిస్తే వారి అంత్యక్రియలు కూడా ఊరికి దూరంగా, ఎవరికీ కనిపించని చోట నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అగ్ర కులానికి చెందిన రైతు శివాజీ (శివాజీ) హఠాత్తుగా మరణిస్తాడు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి వీల్లేదని ఆ కుల పెద్దలు అడ్డుతగులుతారు. దీంతో తన తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలని కొడుకు విష్ణు (నందు), కూతురు సుజాత (మనికా చిక్కాల), ఊరి సర్పంచ్ (నవదీప్) కలిసి పోరాటం మొదలుపెడతారు. అయితే సొంత కులమే శివాజీని ఎందుకు వెలివేసింది? తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు, ఈ కుల రాజకీయాలకు సంబంధం ఏంటి? వేశ్య శ్రీలత (బిందుమాధవి) పాత్ర శివాజీ జీవితాన్ని ఎలా మార్చింది? చివరికి శివాజీ అంత్యక్రియలు సజావుగా సాగాయా లేదా? అనేదే మిగతా కథ.

# అమితాబ్‌కూ తప్పని అభిమానుల తాకిడి



సూరత్ ఎయిర్‌పోర్టులో తప్పిన ముప్పు

ఇటీవల ఫ్యాన్స్ అత్యుత్సాహంతో సెలబ్రిటీలు ఎంత ఇబ్బంది పడుతున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిధి అగర్వాల్, సమంత, విజయ్, తనూజ ఇలా పలువురు ఫ్యాన్స్ వలన చాలా ఇబ్బందికి గురయ్యారు. ఇక ఇప్పుడు ఇదే జాబితాలో అమితాబ్ బచ్చన్ కూడా చేరారు. సూరత్ ఎయిర్ పోర్టులో ఆయనని చూసేందుకు భారీ ఎత్తున ఫ్యాన్స్ తరలి రాగా, ఆయన తన కారు వద్దకు చేరుకోవడం చాలా కష్టంగా మారింది. అభిమానుల తాకిడి ఒకేసారి ఎక్కువ కావడంతో విమానాశ్రయం ద్వారం వద్ద ఉన్న గ్లాస్ పగిలిపోయింది. ఆ సమయంలో అమితాబ్ కాస్త దూరంగా ఉండడంతో ప్రమాదం నుండి బయటపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇక ఇదిలా ఉంటే ముంబైలోని తన నివాసం 'జల్సా' వద్ద ప్రతి ఆదివారం అభిమానులను పలకరించడం అమితాబ్ బచ్చన్‌కు ఎన్నేళ్లుగా కొనసాగుతున్న ఒక సంప్రదాయంలా మారింది. అయితే ఇటీవల తన ఇంటి వద్ద కనిపించిన అభిమానుల భారీ సంఖ్య, వారి ఉత్సాహం, నిరంతర నినాదాలు బిగ్ బీని భావోద్వేగానికి గురి చేశాయి. జల్సా బయట చేరిన జనసంద్రం తన కోసం కేరింతలు కొడుతుంటే, ఆ ప్రేమను చూసి తాను ఆశ్చర్యపోయినట్టు అమితాబ్ బచ్చన్ వెల్లడిరచారు. ఈ సందర్భంగా అక్కడి దృశ్యాలను వీడియోల రూపంలో తన బ్లాగ్‌లో పంచుకున్న ఆయన, అభిమానుల అనురాగంపై మనస్ఫూర్తిగా స్పందించారు. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమను మాటల్లో వివరించడం కష్టమని చెప్పిన అమితాబ్, ఇంతటి ఆప్యాయత తనకు ఎలా దక్కిందన్నది తనకే ఒక మిస్టరీలా అనిపిస్తోందని పేర్కొన్నారు. తాను చేసిన పనులకన్నా ఎంతో ఎక్కువగా అభిమానులు ప్రేమ చూపిస్తున్నారని, ఆ అనుబంధాన్ని జీవితాంతం మర్చిపోలేనని తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. జల్సా వద్ద కనిపించిన జనసంద్రంలో మరో ఆసక్తికర సంఘటన కూడా చోటు చేసుకుంది. ఒక అభిమాని అమితాబ్ కుమారుడు అభిషేక్ బచ్చన్ ఫోటో ఉన్న పోస్టర్‌ను పట్టుకుని, అందులో ఆయన సినిమాలను ప్రశంసిస్తూ వ్యాఖ్యలు చేయడం అమితాబ్ దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పందించిన బిగ్ బీ, తండ్రిగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొడుకు ఎప్పుడూ గర్వాన్ని, గౌరవాన్ని తీసుకొస్తాడని, అటువంటి క్షణాలను చూడడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



# తొలి రోజు నుంచే.. జోరు

పండగకు వస్తున్నారు.. అంటూ టాలీవుడ్‌లో పండగ తీసుకొచ్చారు మన శంకరవరప్రసాద్ గారు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌టాక్‌తో అలరిస్తోంది. చాలా రోజుల తర్వాత వింటేజ్ చిరును చూశామంటూ అభిమానులు సంబర పడుతున్నారు. దీంతో ప్రీమియర్స్ పూర్తికాగానే మూవీ టీమ్ సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకుంది. చిరంజీవితో పాటు అనిల్ రావిపూడి, సాహు గారపాటి, సుస్మిత కొణిదెల కేక్ కట్ చేసి స్వీట్స్ తినిపించుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ పెద్ద పండగకు భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకోవడంలో విజయం సాధించింది. దీంతో టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. తాజాగా చిరు ఈ సినిమాతో మరో ఘనత సాధించారు. ప్రీమియర్స్‌లోనే వన్ మిలియన్ డాలర్లరు వసూలు చేసిన చిరు రెండో చిత్రంగా ఇది నిలిచింది. మరోవైపు ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ బుక్‌మై షోలో 24 గంటల్లో 2లక్షల 86వేల టికెట్స్ అమ్ముడైనట్లు పేర్కొంది.

# నేను డాక్టర్‌ని.. సిస్టర్‌ను కాను



**విలేకరికి శ్రీలీల ఫన్నీ రిప్లై**

టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ప్రస్తుతం తన కోలీవుడ్ డెబ్యూ మూవీ 'పరాశక్తి' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన ఆమె నటించిన ఈ చిత్రం శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం కేరళలోని కొచ్చికి శ్రీలీల వెళ్లగా.. అక్కడ జరిగిన ప్రెస్ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను ఫ్లర్ట్ చేస్తూ సరదాగా అడిగిన ప్రశ్నలు, దానికి ఆమె ఇచ్చిన క్యూట్ రియాక్షన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను పలకరిస్తూ మీకు తమిళం వచ్చా అని అడగగా, ఆమె అవును వచ్చు అని సమాధానమిస్తుంది. అనంతరం ఆ రిపోర్టర్ శ్రీలీల అందాన్ని పొగుడుతూ.. మిమ్మల్ని మొదటిసారి నేరుగా చూస్తున్నాను, మీరు చాలా అందంగా ఉన్నారు అని చెప్పడంతో ఆమె ఒక్కసారిగా సిగ్గుపడుతూ నవ్వేశారు. అయితే వెంటనే ఆ రిపోర్టర్ ట్విస్ట్ ఇస్తూ.. మీరు నాకు ఒక సిస్టర్ లాగా అనిపిస్తున్నారు అని అనడంతో, శ్రీలీల తనదైన శైలిలో.. తాను మెడికల్ స్టూడెంట్ అన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. నేను డాక్టర్‌ను, సిస్టర్‌ను (నర్సును) కాదు అంటూ చమత్కరించారు. శ్రీలీల ఇచ్చిన ఈ ఫన్నీ కౌంటర్‌తో అక్కడ నవ్వులు పూశాయి. ప్రస్తుతం ఈ క్యూట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# రాజాసాబ్ ప్రభాస్ మూడ్రోజుల వసూళ్ళు 183 కోట్ల గ్రాస్



మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ది రాజాసాబ్' సినిమా సోషియో ఫాంటసీ డ్రామాగా రూపొందింది. మైండ్ గేమ్ ఛాలెంజింగ్‌గా వచ్చిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. నైజాం ప్రీమియర్స్ పరంగా కాస్త దెబ్బ పడిన ఓవరాల్ మాత్రం సాలిడ్ స్టార్టప్ అందుకుంది రాజాసాబ్. మొదటి రోజు ప్రపంచ వ్యాప్తంగా రూ. 112 కోట్లు గ్రాస్ వసూలు చేసింది. దీంతో.. ప్రభాస్ కెరీర్లో వంద కోట్ల ఓపెనింగ్స్ రాబట్టిన 6వ సినిమాగా రాజాసాబ్ రికార్డ్ నమోదు చేసింది. మిక్స్ టాక్ వచ్చిన సరే ఎక్కడా తగ్గకుండా దూసుకెళ్తున్నాడు రాజాసాబ్. ఇక ఈ సినిమా ఫస్ట్ వీక్ రన్ ఫినిష్ చేసుకుంది. రిలీజ్ అయిన మూడు రోజులకు గాను రూ. 183 కోట్ల గ్రాస్ రాబట్టి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక నేటి నుండి వరుస సెలవలు కావడంతో బుకింగ్స్ లో జోరు చూపిస్తూ ఈ రోజు ముగిసేనాటికి రూ. 200 కోట్ల మార్క్ అందుకుంటుందనీ ట్రేడ్ అంచనా వేస్తుంది.

